

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో జూన్ 30న సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహిస్తామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరవ్వాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు.

కాంట్రాక్టు సిబ్బంది వేతన వెతలు

- విద్యాశాఖలో అరకొర జీతాలు
- పని ఒత్తిడితో తీవ్ర సతమతం
- క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు. 14 ఏళ్లుగా కనీస వేతనాలు కరువై కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమాన పనికి సమాన జీతాలు ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నారు.

2011 నుంచి జిల్లాలో అన్ని మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల పరిధి, కార్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కరువైంది. సర్వ శిక్షాభియాన్ ద్వారా కలెక్టర్, నలుగురు సభ్యులున్న జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎపి స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996 రూల్ 22 ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన రాత పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా కాంట్రాక్టు ఉద్యోగులను నియమించారు. సమగ్ర శిక్ష విద్యా శాఖలో మండల లెవెల్, కాంప్లెక్స్, వివిధ పాఠశాలల్లో ఎంఐఎస్‌లు 65 మంది, సిఐలు 65 మంది, ఎంఎల్ఎ, (మండల లెవెల్ అకౌంట్), సిఆర్‌పిలు 300 మంది, ఐఇఆర్‌టిలు 150 మంది, అసిస్టెంట్ ఎంఆర్‌సిలు 65, పార్ట్ టైం టీచర్స్ 800 మంది ఉండగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1660 మంది పని చేస్తున్నారు. వీరంతా తల్లికి వందనం, విద్యా కానుక, ఒఎస్‌సి చిల్డ్రన్, బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం, గోరుముద్ద, పిల్లలపై విశ్లేషణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖలో అన్ని రకాల ముఖ్య సమాచారం నివేదికలను అందించడంలో వీరంతా ముఖ్య భూమికను పోషిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో పాఠశాల విద్యాశాఖకు సిబ్బంది లేనందున సంబంధిత శాఖ పరిపాలన పరమైన విధులు, భాద్యతలు నిర్వహిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారికి సబార్డినేట్స్‌గా విద్యాభివద్ధికి సంబంధించి అన్ని రకాల భాద్యతలు చేస్తున్నారు.



సమస్యలపై ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది (ఫైల్ ఫొటో)

ఉద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఎస్ఎస్ఎ వ్యవస్థలో 11 రకాలుగా వీరంతా పని చేస్తున్నారు. 60 శాతం నిధులు, కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. కేంద్రం నుంచి వస్తున్న 60 శాతం నిధులతోనే ఎస్ఎస్ఎను నిర్వహిస్తున్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు తమ బాధ్యతలను పక్కన పెట్టి వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీరిలో అనేకమందికి ఐదేళ్లయినా వేతనాలు పెరగలేదు. 2024లో 21 రోజుల సమ్మె సందర్భంగా వీరికి మినిమం టైమ్ స్కేల్, హెచ్ఆర్ పాలసీను అమలు చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీ వేసి రాత పూర్వకంగా హామీలను రాసి ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమ్మె జరగ్గా అధికారంలోకి రావడం కోసం కూటమి పెద్దలు సమ్మె సందర్భంగా అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రావడమే కాక సిఎం తనయుడు లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కానీ ఈ ఉద్యోగుల పరిస్థితుల్లో మార్పులు మాత్రం రాలేదు. ప్రభుత్వానికే చిన్న చూపు ఉండడం వల్ల అధికారులు కూడా అదే పంథాను అనుసరిస్తున్నారు. దీంతో అదనపు పనులు తప్పడం లేదు. బుక్స్‌ను స్కూల్‌కు తీసుకెళ్లే పని వీరే చేయాలి. హమాలీల మాదిరిగా పుస్తకాలను ఇతర వస్తువులను వీరితోనే మోయిస్తున్నారు. వేళా పాళా లేకుండా పనులే కాకుండా సాయంత్రం 5 దాటిన తర్వాత కూడా జూమ్ సమావేశాలు, ఆదివారం కూడా పని ఒత్తిడి పెరిగింది.



మానవత్వం లేకపోతే ఎలా

సమగ్ర శిక్ష ఉద్యోగులకు డిఎస్‌సి పోస్టుల్లో వెయిటేజ్ ఇవ్వాలని కోరుతున్నా ఇవ్వలేదు. కనీసం మానవత్వం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఒడిషా, పంజాబ్, కేరళ రాష్ట్రాల్లో వీరిని రెగ్యులర్ చేశారు. ఎపిలో ఎందుకు చేయడం లేదు. ఏటా సర్వీసుకి లెక్కలు వేయకుండా సీనియారిటీని చంపేస్తున్నారు. విధి నిర్వహణలో ఉండగా చనిపోతే ప్రమాద బీమా, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు లేవు.

- చెక్కల రాజ్ కుమార్, ఎపి సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు.

14 ఏళ్లుగా పని చేస్తున్నా గుర్తింపు లేదు

14 ఏళ్లుగా డిగ్రీ బిఇడి అర్హతతో పని చేస్తున్నాం. మా అర్హతలకు తగిన విధంగా కనీస జీతాలు అండడం లేదు. పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన రెగ్యులర్ చేస్తామన్న హామీను వెంటనే అమలు చేయాలి.

- దేశినీడి వెంకటేశ్వరరావు, సిఆర్‌పి,పిఠాపురం

కార్పొరేట్ల కోసమే ఎపి విజన్-2047

ప్రజాశక్తి-కాకినాడ

ఎపి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన విజన్- 2047 డాక్యుమెంట్ కార్పొరేట్ల ప్రయోజనం కోసమే తయారు చేశారని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. శనివారం సాయంత్రం కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విజన్-2047 ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో గంగారావు ముఖ్యవక్తగా ప్రసంగించారు. 229 పేజీలు గల ఎపి విజన్ డాక్యుమెంట్, కేంద్ర బిజెపి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఉందన్నారు. ఈ డాక్యుమెంట్‌లో వ్యవసాయంలో కార్పొరేట్ పద్ధతి ప్రవేశ పెట్టాలని, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహించాలని ఉందన్నారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ పెట్టుబడులకు అవకాశం లేదని, ప్రైవేటు రంగంలో కూడా చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లేదన్నారు. కార్పొరేట్ తరహా అభివృద్ధి అంటే సంపద ఒకేచోట పోగుపడుతుందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయన్నారు. చంద్రబాబు 1999 లో కూడా విజన్ 2020 డాక్యుమెంట్ విడుదల చేశారని గుర్తు చేశారు. అది ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో మెకెన్సీ కంపెనీ తయారు చేసిందన్నారు. తాజా డాక్యుమెంట్ కూడా ప్రభుత్వ అధికారులు తయారు చేయలేదన్నారు. ప్రజా ఉద్యమం ద్వారా పాలకుల విధానాలు మార్చాలని, అప్పుడే రాష్ట్ర అభివద్ధి సమగ్రంగా జరుగుతుందన్నారు. రిటైర్డ్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.మహిపాల్ మాట్లాడుతూ ఏదైనా విజన్ డాక్యుమెంట్ విడుదల చేసే ముందు క్షేత్ర స్థాయిలో అధ్యయనం జరగాలన్నారు. తదుపరి వివిధ వేదికలపై చర్చలు జరగాలని, ప్రాధాన్యతలు నిర్ణయించుకుని అందుకు తగిన విధంగా బడ్జెట్ కేటాయింపులు జరగాలన్నారు. అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కృషిని అభినందించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వివి.రమణ, ఆర్‌విఎన్ స్టడీ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గంగారావు

పంట కాలువల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-కాజులూరు

పంట కాలువల అభివృద్ధికి రైతులు సహకరించాలని కోటిపల్లి సాగునీటి పంపిణీ అధ్యక్షులు దాట్ల విజయ గోపాల్ రాజు అన్నారు. ఆదివారం మండలంలోని కోలంకలో పంటకాలవలో పేరుకుపోయిన మట్టి, గుర్రపు డెక్క, తూటుకూరను జెసిబి సాయంతో తొలగిస్తున్నారు ఈ సందర్భంగా విజయ గోపాలరాజు మాట్లాడుతూ కాలువలు వెంబడి చెత్త చెదారం వేయడంతో పాటు అనేకమంది అరటి చెట్లు, కొబ్బరి చెట్లు నాటడం వల్ల కాలువ అభివృద్ధికి ఆటంకంగా మారాయన్నారు. ప్రతి రైతూ కాలువలు వెంబడి పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొన్ని గ్రామాలలో ఆక్రమణలు తొలగించేందుకు ఆటంకం కలిగిస్తున్నప్పటికీ పోలీసులు సహాయం తీసుకుని అభివృద్ధి చేస్తారని తెలిపారు. శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని, ఒకవేళ అధిక వర్షాలు వచ్చినప్పుడు నీరు పారక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో పంటకాలువ, మురికి కాలువలు అభివద్ధిలో అధికారులకు రైతులు కౌలు రైతులు సహకరించాలన్నారు.

సమస్యలపై ఎంఎల్ఎ చినరాజప్పకు వినతి

ప్రజాశక్తి - పెద్దాపురం

చంద్రమాంపల్లి గ్రామాభివద్ధికి చేపట్టవలసిన పనులపై ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు ఆ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆదివారం స్థానిక సుధా కాలనీలోని ఎంఎలఎ క్యాంపు కార్యాలయంలో పెద్దాపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకటరావు, చంద్రమాంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు రేలంగి బుజ్జి, టిడిపి నాయకులు షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు సమస్యలు వివరించారు. ప్రధానంగా శ్మశాన వాటిక అధ్వానంగా ఉన్నందున దానిని అభివృద్ధి చేయాలన్నారు. 2024 తుపాను కారణంగా రైతాంగానికి తీవ్ర పంట నష్టం జరిగిందన్నారు. ఈ తుపాను కారణంగా ఏలేరు ప్రాజెక్టు నుండి ఏలేరు కాలువలపై అనేక చోట్ల గండ్లు పడ్డాయన్నారు. ఈ గండ్లు పూర్తిస్థాయిలో పూడ్చించే పనులు చేపట్టాలన్నారు. శివారు భూములకు కూడా సాగునీరు అందించేలా కృషి చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ చినరాజప్ప హామీ ఇచ్చారు.



భాస్కరరావును సత్కరిస్తున్న ఉద్యోగులు

భాస్కరరావు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-గండేపల్లి

ఎన్‌టి.రాజాపురంలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఉండవల్లి సూర్య భాస్కరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ బెంగళూరు, బొంబాయి, చెన్నై, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి మహానగరాల నుంచే కాక విదేశాల నుంచి కూడా తన చిన్ననాటి మిత్రులు, గురువులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ వృత్తి కోసం కాక విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. ఎంతో మందిని తీర్చిదిద్దే అవకాశం ఒక ఉపాధ్యాయునికే ఉందన్నారు. తాళ్లూరు, రంగంపేట, కోటపాడు, ఎన్‌టి.రాజాపురం గ్రామాలలో తాను పని చేశానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాయక్, కోర్పు లచ్చయ్య దొర, పోతుల మోహన్‌రావు, చలగళ్ల దొరబాబు, పరిమి బాబు, బిక్కిన గంగాధర్, కంటిపూడి సత్యనారాయణ, కేతిన బాబి, బొల్లంరెడ్డి రామకృష్ణ, తాళ్లూరి మధు కుమార్, వెలమాటి కాశి, మద్దిపట్ల రామకృష్ణ, యుటిఎఫ్ నాయకులు లక్ష్మీదేవి, రాజబాబు, చావ సతీష్ బాబు పాల్గొన్నారు.

నేడు కూటమి ప్రభుత్వం అరాచకాలపై వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

కూటమి ప్రభుత్వం అరాచక పాలనపై సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్టు ఆ పార్టీ పంచాయితీ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సామర్లకోట ప్రసన్నాంజనేయ నగర్‌లోని వైసిపి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయించాలని, ఉపాధి చట్టం మేరకు ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయతీల ద్వారానే జరిపించాలని అన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని, సర్పంచ్‌లకు తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింప చేయాలని కోరారు. కేంద్రం విడుదల చేసిన, 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులు రూ.1,150 కోట్లు స్థానిక సంస్థలకు తక్షణమే జమచేయాలని, ఈ బిల్లులు చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 73, 74 సవరణల మేరకు సర్పంచ్‌లకు ఉన్న అధికారాలను అమలు చేయాలని, జిపి ఎంఎస్. నెం. 11ని రద్దు చేసి గాలిలో ఉన్న 1,350 మంది పంచాయతీ సెక్రటరీలకు పోస్టింగులు ఇచ్చి, 10 నెలలుగా పెండింగులో ఉన్న జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగబోయిన రాజబాబు, ఇనకొండ వీర విష్ణు చక్రం, జెడ్‌పిటిసి గవరసాని సూరిబాబు, గుడివాడ సర్పంచ్ సీమదొర, బండారు వీరబాబు, జ్యోతుల నాగు పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు మూడోస్థానం

ప్రజాశక్తి-పిఠాపురం

ఈ నెల 28, 29 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లు మూడో స్థానంలో నిలిచాయి. జిల్లా టీముకు కోచ్ మేనేజర్లుగా పీడీ శేష్ కుమారి, కె.నాగలింగేశ్వరరావు, వంశీ, కోచ్ పి.లక్ష్మణరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కోచ్ మేనేజర్లను ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ సభ్యులు డిస్ట్రిక్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, ఎపి ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం, పలువురు అభినందించారు.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని ధర్నా

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక వేలంపేటలోని ఇళ్ల మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న ప్రైవేట్ కంపెనీకి చెందిన సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని స్థానికులు ఆదివారం ధర్నా చేపట్టారు. టవర్ నిర్మాణం చేపడుతున్న భవనం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, పాడా, మున్సిపల్ అధికారులకు, జనసేన నాయకులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. దీనిమీద ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. టవర్ నిర్మాణం చేపట్టే పరిసరాల్లో హాస్టల్స్, పాఠశాల, ఇళ్లు ఉన్నాయన్నారు. జనావాసాల మధ్యలో నిర్మిస్తే గర్భిణులు, స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని తక్షణం సెల్ టవర్ నిర్మాణం నిలిపి వేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఘనంగా చేపల వీధి మరిడమ్మ సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి జాతరలో భాగంగా స్థానిక గంగాభవాని ఫిషర్ మ్యాన్ కో ఆపరేటివ్ సొసైటీ చేపల వీధి వారు ఆదివారం మరిడమ్మ అమ్మవారి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ప్రారంభమైన ఈ సంబరంలో డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సంబరంలో విద్యుత్ దీపాలంకరణ మధ్య ఏర్పాటు చేసిన బండ్ల వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సంబరంలో పెద్దపులాటలు, గరగల నృత్యాలు, కాళికా నృత్యాలు, వాయిద్య విన్యాసాలు, డప్పుల దరువులు, పలు జానపద కళారూపాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, కొరుపూరి రాజు, జనసేన పట్టణ అధ్యక్షుడు పొలమరశెట్టి సత్తిబాబు, ఒబిలిశెట్టి గణేష్, పెద్దిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మరిడమ్మ సంబరంలో గరగల నృత్యాలు

దాడిశెట్టి రాజాను కలిసిన ముద్రగడ

ప్రజాశక్తి-తుని

వైసిపి జిల్లా అధ్యక్షుడు మాజీమంత్రి దాడిశెట్టి రాజాను ఆదివారం తుని ఎస్.అన్నవరంలో మాజీ మంత్రి, వైసిపి పిఎసి కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై భవిష్యత్తు కార్యాచరణ, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు. పార్టీని బలోపేతం చేసే విధంగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలను బలోపేతం చేసి ఆయా గ్రామ స్థాయి, మండల స్థాయి జిల్లా స్థాయిలో ఉన్న కమిటీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడాలని ముద్రగడ పద్మనాభం అన్నారు. ఈ కార్యక్రమంలో నరిసే శివాజీ, గౌతు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి జాతరలో భాగంగా మొదటి ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. యాత్రికులు వేగవంతంగా అమ్మవారిని దర్శించుకునే విధంగా ఆలయ అనువంశిక ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి క్యూ లైన్లను పర్యవేక్షించారు. యాత్రికులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చిన యాత్రికులకు పలు స్వచ్ఛంద సంస్థలు వివిధ రకాల సేవలందించాయి. పిఠాపురానికి చెందిన గోపాల బాబా ఆశ్రమం వారు యాత్రికులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేయగా మరికొన్ని సంస్థలు చక్ర పొంగలి, పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోటరీ గోల్డెన్ జూబ్లీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వృద్ధులకు సామాజిక భద్రత కల్పించడానికి వృద్ధాశ్రమాన్ని ఏర్పాటుచేసి అండగా నిలుస్తున్న రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సేవలు అభినందనీయమని ఎస్ఆర్ఎంటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నె సుధీర్ పేర్కొన్నారు. రమణయ్యపేట రాయుడుపాలెంలో రోటరీ ఆశ్రయ వద్ధాశ్రమంలో సిక్ రూమ్‌లను ప్రారంభించిన సుధీర్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న వద్దులకు ఈ సిక్ రూములు ఎంతో ఉపయుక్తమన్నారు. భవిష్యత్తులో ఏ మంచి కార్యక్రమం చేపట్టినా తమ వంతు సహకారం ఉంటుందని సుదీర్ తెలిపారు. రోటరీ చైర్మన్ జివి.కృష్ణప్రకాష్, డాక్టర్ రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, శిట్ల శ్రీకాంత్, ధన సాగర ప్రసాద్, డాక్టర్ సతీష్, ఉషారాణి, సత్యపాల్, చార్మినార్ వర్మ, సూర్యారావు, మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని నవోదయ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 43 మండలాల పరిధిలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3,4,5 తరగతులు అంతరాయం లేకుండా చదివినవారు అర్హులన్నారు. 1-5-2014 నుంచి 31-7-2016 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవోదయ వెబ్సైట్‌లో లాగిన్ అయి దరఖాస్తు నింపాలన్నారు. ఆధార్ కార్డు నెంబరు వెయ్యాలన్నారు. అభ్యర్థి పాస్‌పోర్ట్ సైజు ఫోటో, సంతకం, తల్లి లేదా తండ్రి సంతకం చేసి అప్లికేషన్ 29-7-2025 లోగా అప్లోడ్ చేయాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



ప్రయివేటుకు ఫిట్‌నెస్

నీలిమ శ్రీనివాసరావుకు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట నీలిమ హోటల్ అధినేత అమలకంటి శ్రీనివాసరావును ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ గౌరవ డాక్టరేట్ అవార్డు కోసం ఎంపిక చేసింది. శనివారం సాయంత్రం తమిళనాడు రాష్ట్రం హోసూరులో ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అకాడమీ ప్రతినిధులు అందజేశారు. ఈ అవార్డు రావడం పట్ల నీలిమ హోటల్ సిబ్బంది, సామర్లకోట గ్రామస్తులు, బంధువులు, శ్రీభీమేశ్వర లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు. ఆయన చేసిన అన్నదాన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవలను గుర్తించడంపై హర్షం వ్యక్తం చేశారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాసరావు

5న జగ్గంపేటలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - జగ్గంపేట

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జులై 5న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ డి.చెన్నారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ వికాస సహకారంతో నిర్వహించే ఈ జాబ్ మేళాలో సాఫ్ట్‌వేర్, ఫార్మా, బ్యాంకింగ్, బిపిఒ, టెక్నికల్ రంగాలైన సుమారు 33 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. వాటి ద్వారా 1200 మందికి ఉద్యోగావకాశాలు కలుగనున్నాయని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 45 ఏళ్ల లోపు అభ్యర్థులు అందరూ హాజరుకావచ్చన్నారు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాలను బట్టి రూ.13 వేల నుండి రూ.40 వేల వరకూ జీతం, ఇన్‌సెంటివ్ ఇస్తారని తెలిపారు.

జూలై 6న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక దర్గాపేట సాయిబాబా గుడి వీధిలోని మన ఇల్లు ఆశ్రమం వద్ద జులై 6న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు వంగలపూడి సతీష్, కురియన్ కుమార్, దుర్గా చైతన్య సాయి, సత్య కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మన ఇల్లు ఆశ్రమం ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం చేయుడం ద్వారా ముగ్గురికి ప్రాణదాతలుగా నిలుస్తారని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

జగ్గంపేటలో వేగ గోల్డ్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన వేగ గోల్డ్ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గోల్డ్ ఎగ్జిబిషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు, వేగ జూయలర్స్ మేనేజర్ ఎం.జగన్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-కాజులూరు

సహకార సంఘాలకు త్రీసభ్య కమిటీ ఎంపిక దాదాపు పూర్తయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూసిన పలువురు సహకార సంఘాల అధ్యక్షులుగా నామినేట్ అయినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న టిడిపి, జనసేన, బిజెపిలకు చెందిన నాయకులను సహకార సంఘాల పదవులు వరించనున్నాయి. టిడిపికి చెందిన కోట తాతబ్బాయి ఆర్యవటం, అంగర కృష్ణ గొల్లపాలెం, కాలా నరసింహమూర్తి పల్లిపాలెం, కొల్లు వెంకటేశ్వరరావు పెనుమల్ల, పితాని సతీష్ కుమార్ తణుకువాడ సహకార సంఘాలకు, జనసేన పార్టీకి సంబంధించి కొండమూరి సత్యనారాయణ జగన్నాథగిరి, యాళ్ల వెంకటరమణ కాజులూరు, బొండా వెంకట నరసింహ నాయుడు కోలంక, గండి ధనరాజు మంజేరు సహకార సంఘాలకు, బిజెపికి చెందిన యాళ్ల తనీబాబు దుగ్గుదుర్రు సహకార సంఘానికి అధ్యక్షులుగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

నేరాలు ఘోరాలు

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని కాట్రేనికోన పంచాయతీ శివారుగచ్చకాయలపోరకు చెందిన మత్స్యకారుడు మూదే సుబ్బారావు (56) శనివారం రాత్రి అల్లిపర్రకు వెళ్లే వరి కాలువలో పడి మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం రాత్రి వేళ చేపల వేటకు అల్లిపర్రకు వెళ్లిన సుబ్బారావు ఉదయం ఇంటికి రాలేదు. దీంతో ఆదివారం అతని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. అల్లిపర్రకు వెళ్లే వరి కాలువలో అతను శవమై తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమైనారు. చేపల కోసం వేసిన వల, చేపలుతో ఉన్న సంచి మతదేహం మొలకు ఉన్నాయి. మృతుడు మూదే సుబ్బారావుకు భార్య లక్ష్మి, ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నాయి. కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు సహకారంతో కాట్రేనికోన పోలీసులకు, తహశీల్దారుకు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది శవపంచనామ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పోర్టుమార్టం నిర్వహించారు. బాధితుల పిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాండ్రేగులలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ వైఆర్కె.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఎస్క్మీ రఘునాథరావు వారి సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. రూ.5100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో జగ్గంపేట జట్టు విజయం

ప్రజాశక్తి - జగ్గంపేట

కోరాడ సాయిరామ్ శ్రీనివాస్ (గిల్) మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో జగ్గంపేట జట్టు విజయం సాధించింది. శ్రీనివాస్ తండ్రి కోరాడ సుబ్బారావు, కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంలో ఈ నెల 12న ప్రారంభమైన పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో 34 టీములు పాల్గొనగా జగ్గంపేట టీమ్ విన్నర్‌గా, గుర్రంపాలెం టీమ్ రన్నర్‌గా నిలిచాయి. వారికి టిడిపి మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం మొదటి బహుమతి రూ.25,555 నగదు, ట్రోఫీ అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన గుర్రంపాలెం టీముకు రూ.15,555 నగదుతో పాటు షీల్డ్‌ను, 3వ విజేతకు రూ.5,555 నగదును అందించారు. ఈ కార్యక్రమంలో కొండ్రోతు శ్రీను, కొండ్రోతు పైడియ్య, కొండ్రోతు నరసింహులు, ఆర్గనైజింగ్ టీమ్ ఆలీషా, కిరణ్, పీలా మణికంఠ, జాన్, పప్పీ, రాజు పాల్గొన్నారు.

250 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్ద బజార్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 250 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. నిర్వాహకులు అమిత్ కుమార్ జైన్, సుమిత్ కుమార్ జైన్ మాట్లాడుతూ తమ తండ్రి అయిన బవర్లాల్ డి జైన్ ప్రారంభించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని 17వ శిబిరంగా కాకినాడ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నిర్వహించిన శిబిరంలో డాక్టర్ అశ్విన్, డాక్టర్ రే మున్నిసా కార్నియా మార్పు, రెప్పల వాలడాన్ని సరిచేయడం, మెల్ల కన్ను, రెటీనా, పిల్లలకు శుక్లాలు, నీటికాసులు ఇబ్బందులపై ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. 63 మంది ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు అమిత్, సుమీత్ జైన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జైన్ కుటుంబ సభ్యులు, పరమేశ్వరి మెడికల్ షాపు అదినేత ఊర సత్యనారాయణ, లయన్స్ క్లబ్ నాయకుడు కర్రి ఆదినారాయణ రెడ్డి, కిరణ్ కంటి ఆసుపత్రి మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్టణంలో రోడ్డుకు ఇరువైపుల గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రతి రోజు ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ కృష్ణ భగవాన్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగరావు ఆదివారం కాంట్రాక్టర్ జెపి కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌ను సంప్రదించి రోడ్డుకి ఇరువైపులా గ్రావెల్ మట్టి వేయించి గుంతలను స్వయంగా దగ్గర ఉండి పూడ్చారు. ఈ సందర్భంగా రోడ్ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన ట్రాఫిక్ ఎస్ఐ గరగరావును, సిబ్బందిని పలువురు అభినందించారు.

యుద్ధాల పేరుతో ప్రపంచ శాంతి దూరం

ప్రజాశక్తి - రామచంద్రపురం

సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాల పేరుతో ప్రపంచ ప్రజలకు శాంతి సుఖమైన జీవితాన్ని లేకుండా చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర నాయకులైన డేగ ప్రభాకర్ అన్నారు. సిపిఐ రామచంద్రపురం ఏరియా 18వ మహాసభ డాక్టర్ చెలికాని రామారావు భవనం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులైన డేగ ప్రభాకర్ మాట్లాడుతూ సిపిఐ 100వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జరిగే మహాసభలు జయప్రదం చేయాలన్నారు. డాక్టర్ చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ అలాగే జులై 19, 20, 21 తేదీల్లో అమలాపురంలో జరుగు సిపిఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ వి.శామ్యూల్ మాట్లాడుతూ జిల్లా ప్రజానాట్య మండలి జిల్లా మహాసభ వచ్చే నెల 6న రామచం ద్రపు రంలో నిర్వహిస్తారన్నారు. ఈ మహాసభలో సిపిఐ ఏరియా కార్య దర్శిగా పెద్దిరెడ్డి రాము, సహాయ కార్యదర్శిగా వి.రాంబాబు, 13 మందిని కార్యవర్గ సభ్యులు ఆమోదిం చారు.సిపిఐ నాయకురాలు ఎస్.శారదా దేవి ఈ మహాసభ జయప్రదం చేసిన వారికి అభినందనలు తెలిపారు.

యాంత్రీకరణతో మెరుగైన ఫలితాలు

వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు





ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

యాంత్రీకరణ విధానంలో వ్యవసాయ సాగు చేయడం మెరుగైన ఫలితాలను ఇస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా తాజాగా ఖరీఫ్‌సాగుకు రైతాంగం సిద్ధమవుతున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లాలో 675 యూనిట్స్‌కి రూ.3.58 కోట్ల మేర రాయితీపై యంత్ర పరికరాలు ఇటీవల అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ఆయనను పలకరించింది.

జిల్లాలో 675 యూనిట్స్‌కి ఏ మేరకు రాయితీ ఇచ్చారు?

వ్యవసాయ యాంత్రీకరణ యూనిట్స్ ఏర్పాటుకు సంబంధించి 211 రైతు సేవా కేంద్రాల పరిధిలో 675 వివిధ యూనిట్స్ గ్రౌండింగ్ చేశాము. వీటి ద్వారా రూ.3,58,27,637లు సబ్సిడీ రూపంలో రైతులకు ప్రయోజనం చేకూరింది. గ్రామ, మండల స్థాయిలో ఉన్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతన్నలు పరస్పరం మార్పిడి చేసుకోవడం ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవచ్చు. యంత్ర పరికరాల వినియోగంతో వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

ప్రకృతి సాగు విస్తీర్ణం ఎంత పెంచాలి?

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 2.07 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచడంపై దృష్టి సారించాలి. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి. రైతు సేవా కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక పరికరాలు, యూనిట్స్‌ను అవసరానికి అనుగుణంగా ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని వాటి ద్వారా పొందే ప్రయోజనాలు అందరికీ అందుబాటులో దక్కేలా చూసుకోవాలి. అదేవిధంగా పంట మార్పిడి విధానాలు స్వాగతించాలి.

డ్రోన్ టెక్నాలజీతో ఎంతో మేలు ?

నూతన సాంకేతిక ఆవిష్కరణలు, పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులకు డ్రోన్లను ఎంతో లాభసాటిగా ఉంటాయి. డ్రోన్ టెక్నాలజీ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులు వెదజల్లే ప్రక్రియను వ్యవసాయ సాగు పద్ధతుల్లో అమలు చేయాలి. అందువలన క్రిమి సంహారక మందులు ప్రభావం రైతులపై పడే అవకాశం తక్కువ స్థాయిలో ఉంటుంది. వృధాను గణనీయంగా తగ్గించడం ఈ ప్రక్రియలో సాధ్యం అవుతుంది. ఒకరి వద్ద ఉన్న యాంత్రీకరణ యూనిట్స్ మరొకరితో పంచుకోవడంపై దృష్టి పెట్టాలి.

వ్యవసాయ రంగంలో మార్పులకు అనుగుణంగా సాగు విధానాలు ?

రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. రసాయన ఎరువుల వినియోగం పెరుగటంతో చీడపీడలు తెగుళ్ల అధికమవుతాయి. ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించటం వల్ల సాగుపై ఖర్చుల భారం తగ్గటంతో పాటు భూసారం పెరుగుతుంది. జీవ సంబంధమైన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తున్న విషయం ప్రతి ఒక్కరికీ విదితమే. నేటి ఆధునిక కాలంలో వ్యవసాయ రంగంలో మార్పులు గమనించి ఉత్తమ సాగు విధానాలు అవలంబించాలి.

అక్రమ మద్యంపై విస్తృతంగా దాడులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్




ఎక్సైజ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ కమిషనర్ రాహుల్‌దేవ్ శర్మ

జిల్లాలో అక్రమ మద్యంపై విస్తృతంగా దాడులు నిర్వహించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. ఆదివారం నవోదయం 2.0 అమలు, పురోగతిపై ఆయన జిల్లా అధికారులు, అన్ని స్టేషన్ హౌస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాను అక్రమ స్వేదన(ఐడి) మద్యం రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో జిల్లా అంతటా దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అక్రమ మద్యం తయారీలో పాల్గొన్న నల్ల బెల్లం సరఫరాదారులపై తగిన చట్టపరమైన నిబంధనల కింద కేసులు నమోదు చేయాలని అన్నారు. పునరావృత నేరస్థులు, అలవాటుగా ఉల్లంఘించేవారిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రివెంటివ్ డిటెన్షన్ పీడీ చట్టం కింద అరెస్టులు చేయాలని ఆదేశించారు. పొరుగు జిల్లాల్లో ఇటీవల గుర్తించబడిన కల్తీ మద్యం కేసుల నమోదు అయ్యాయని, కావున మద్యం సేవించే వారు లైసెన్స్ పొందిన రిటైల్ దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేసేలా అవగాహన పెంచాలన్నారు. మద్యం బాటిల్ మూత తెరిచి ఉన్నా, మూత లేకుండా ఉన్నా, లేదా తారుమారు చేయబడినా మద్యాన్ని కొనుగోలు చేయవద్దని అవగాహన పెంచాలన్నారు. అక్రమంగా స్వేదనం చేయబడిన మద్యం, నకిలీ మద్యం, ఇతర ఎక్సైజ్ సంబంధిత ఉల్లంఘనలకు సంబంధించిన ఏవైనా సంఘటనలను టోల్-ఫ్రీ ఎక్సైజ్ హెల్ప్‌లైన్ 14405కు డయల్ చేయడం ద్వారా పౌరులు నివేదించాలని ప్రజలను ఆయన కోరారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వై.చైతన్య మురళి, సహాయ కమిషనర్ ఎం.శివప్రసాద్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సిహెచ్. లావణ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వానరాలు

ప్రజాశక్తి - గోకవరం



వసతి గృహం వద్ద వానరాల సంచారం

స్థానిక సంజీవయ్య నగర్ కాలనీలో వానరాలు ప్రజలను బెంబెలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా అదే ప్రాంతంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులు వానరాల దాడిని తట్టుకోలేక పరుగులు పెడుతున్నారు. వానరాలకు అర్ధరాత్రి..అపరాత్రి తేడా లేకుండా వసతి గృహంలోకి ప్రవేశించి విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. భోజనాలు చేసే క్రమంలో ఒక్కసారిగా వసతి గృహంలోకి ప్రవేశించి విద్యార్థుల భోజనాలను లాక్కుపోతున్నాయి. వాటిని కొట్టేందుకు ప్రయత్నిస్తుంటే విద్యార్థులపైకి దాడికి దిగుతున్నాయి. వసతి గృహంలో వంటి చేసే సమయంలోనూ వంట చేసే సామాగ్రిని సైతం ధ్వంసం చేసి తయారు చేసిన ఆహారాన్ని పట్టుకుపోతున్నాయి. వానరాల సమస్యను పరిష్కరించాలని స్థానిక అధికారులు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వానరాల బెడదను తీర్చేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

సైన్స్‌పై అవగాహన అవసరం: జెవివి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకునేందుకు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక(జెవివి) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భీమయ్య, ఎన్.రవిబాబు అన్నారు. ఆదివారం నగరంలోని దానవాయిపేటలోని ప్రదీప్ డయాబెటిస్ హస్పటల్ వద్ద జెవివి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెవివి సభ్యత్వ క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 38 సంవత్సరాలుగా తెలుగు ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని, మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను చైతన్యవంతం చేస్తుందని అన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు, చెకుముకి సైన్స్ పరీక్ష, సదస్సులు నిర్వహిస్తూ చైతన్యవంతులైన ప్రజలు జనవిజ్ఞాన వేదిక సభ్యులుగా చేరాలని కోరడం జరుగుతుందన్నారు. జీవుల జన్యు నిర్మాణం గురించి, వచ్చే రోగాలు, వాటి చికిత్స గురించి ఎంతో ముందుకు వెళ్లామని, కానీ ఇంకా మన సమాజంలో అశాస్త్రీయ భావజాలం రాజ్యమేలుతూనే ఉందనప్పారు. దీనికి సైన్సు అందిస్తున్న ఫలితాలు సామాన్యుని వద్దకు చేరకపోవడమే కారణమని తెలిపారు. సైన్స్ ఇప్పటికీ పాఠ్య గ్రంథాలలో ఉంది తప్ప జీవన విధానంగా మారలేదన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జి.తాతారావు, జిల్లా నాయకులు డాక్టర్ సి.ప్రదీప్, ఎఎన్.సుధారాణి, కె.రంగవల్లి, బిఎస్‌విపి.ప్రసాదరావు, సిహెచ్.నిశ్చల్, కెవి.గణేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

దివిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇతర పాఠశాలలకు బదిలీ అయిన 11 మంది ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శ్రీవల్లి అధ్యక్షతన నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు నాగజ్యోతి, గంగాభవాని, సూరిబాబు, జగన్నాథం, జిలాని, భాషా, వరహాల బాబు, మాలతి, కరుణాకర్, విశ్వేశ్వర శాస్త్రి, ఆచార్యులు మాస్టార్లను పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ పాఠశాల విద్యాభివద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎడవల్లి లక్ష్మణరావు, పాఠశాల పూర్వ విద్యార్థి, మాజీ సర్పంచ్ కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), ఉపాధ్యాయులు బీపెల్లి దుర్గాజీరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు సత్తిబాబు మద్దతు

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 54వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బేదంపూడి సత్తిబాబు సమ్మె శిబిరానికి వచ్చి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, బాసిన భద్రరావు, శ్రీనివాస్, అయ్యప్ప స్వామి, పూల ప్రశాంత్, మలిపెద్ది భద్రరావు, జి.నాగేశ్వరరావు, ఎస్‌కె.బషీర్ తదితరులు పాల్గొన్నారు.

1న వల్లభ ఆలయ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని జూలై 1న లెక్కించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్‌ల సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కింపు జరుపుతారన్నారు.

ఎఆర్ఎం చేట్ల వజ్రం సేవలు విలువైనవి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అసిస్టెంట్ రీజినల్ మేనేజర్ (ఎఆర్ఎం)గా పని చేస్తూ అందరి మన్ననలూ పొందిన చేట్ల వజ్రం సేవలు మరువలేనివని పలువురు వక్తలు ప్రశంసించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం కాంప్లెక్స్ ఆవరణలో వజ్రం దంపతులకు ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ సేపేని సురేష్ అధ్యక్షత వహించారు. వజ్రం కషి ప్రామాణికత ఆర్‌టిసి కాంప్లెక్స్ అభివృద్ధికి ఎంతో తోడ్పడిందని నిర్వాహకులు కొనియాడారు.

మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

ప్రజాశక్తి - కొవ్వూరు



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ

ప్రజలను నమ్మించి మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని వైసిపి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శంచారు. ఆదివారం స్థానిక లీటరరీ క్లబ్ కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు విసుగెత్తిపో యారని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజల వద్దకు వెళ్లి గుర్తు చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తలారి వెంకట్రావు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన మోసపూరితమైన హామీలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కోడూరు శివరామకృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంటమణి రమేష్, ఎఎంసి మాజీ ఛైర్మన్ బండి పట్టాభిరామారావు, పార్టీ మండల అధ్యక్షులు కొలిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు మట్ట వెంకటరావు, వెంపాటి సురేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పిఠాపురం సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా బైకులు నడుపుతున్న వారికి చలానా విధించినట్లు తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల నష్టాలపై వాహనదారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

1 నుంచి టిడిపి బూత్ కన్వీనర్లకు శిక్షణ

ప్రజాశక్తి - కొత్తపేట

నియోజకవర్గ పరిధిలో టిడిపి బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, యూనిట్, కోఇన్‌ఛార్జిలు, క్లస్టర్, కో ఇంఛార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుకు శిక్షణా తరగతులు జులై 1న ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట కాపు కళ్యాణ మండపం నందు ఈ శిక్షణా తరగతులు ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అధ్యక్షతన నిర్వహిస్తారన్నారు. టిడిపికి సంబంధించి ట్రయినీస్ శిక్షణలో పాల్గొంటారన్నారు.

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం త్రి రత్న బుద్ధ విహార్ నందు ద బుద్దిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా జిల్లా సమావేశం ఆదివారం రాంబోది కాశి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జూలై 25వ తేదీన 'బుద్ధనితో నా ప్రయాణం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అనే నాటకం' అమలాపురంలోని ఇండోర్ స్టేడియంలో ప్రదర్శిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఈ నాటకాన్ని అంబేద్కరీయులు, బౌద్ధ ఉపాసకులు, ధమ్మ బోధకులు, బహుజనులు ప్రతీ ఒక్కరూ తిలకించాలని ఆయన న్నారు. అదే విధంగా బిఎస్ఐ సభ్యత్వ నమోదు ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డిబి.లోక్, జిల్లా ఉపాధ్యక్షులు కోలా త్రిమూర్తులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, కె.భరత్ కుమార్ సింహ బోధి, డాక్టర్ పి.నాగేశ్వరరావు, ఇవివి.సత్యనారాయణ, బొంతు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు



చంద్రమోహన్ నోబిస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రెవెన్యూ అధికారులు

ఘనంగా చంద్రమోహన్ నోబిస్ జయంతి

ప్రజాశక్తి - గోపాలపురం

భారతీయ గణాంక శాస్త్ర పితామహుడు చంద్రమోహన్ నోబిస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఒ జోడాల వెంకట్ ప్రశాంత చంద్ర మోహన్ నోబిస్ 'మహలనోబిస్ దూరం' అనే గణాంక కొలతను కనుగొన్నట్లు తెలిపారు. గణాంకశాస్త్రంలో పరిశోధనలు చేసిన ఆయన భారతదేశ రెండవ పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో పాలుపంచుకున్నాడని గుర్తు చేశారు. 1957లో అంతర్జాతీయ గణాంక సంస్థ గౌరవ అధ్యక్షుడిగా నియమితులయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ సహాయకులు నల్లరాజు, విఆర్ఒలు పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం

సాయి స్ఫూర్తి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజల అవసరాలను గుర్తించి ఆయా గ్రామాలలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సాయి స్ఫూర్తి ఆసుపత్రి సేవలు అభినందనీయమని వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మి రెడ్డి పరశురామారావు అన్నారు. ఆదివారం సాయి స్ఫూర్తి హాస్పటల్ ఆధ్వర్యంలో వేగేశ్వరపురంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిఇఒ గూడా రాజు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల వైద్య సేవలతో 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని అన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ విటి.వర్మ, డాక్టర్ రామారావు, డాక్టర్ మౌనిక, డాక్టర్ వందన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

తీరనున్న తాగునీటి సమస్య

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని యర్నగూడెం గ్రామంలో ఎండి పేట వాసుల నీటి సమస్య తీరనుందని సర్పంచ్ బొంతా భరత్‌బాబు అన్నారు. ఆదివారం రూ.10 లక్షల జడ్‌పి నిధులతో పంచాయతీ వద్ద బోరు నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997లో అప్పటి ఎంఎల్‌ఎ జొన్నకూటి బాబాజీరావు రూ.20 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ హెడ్ ట్యాంక్ నిర్మించారని, ఆ ప్రాంతంలో బోరు పడకపోవడంతో పలుమార్లు ప్రయత్నించి విఫలం కావడంతో నాటి నుంచి ఈ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా లేకుండా పోయిందన్నారు. ఆ సమస్యను ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు దృష్టికి తీసుకెళ్లడంతో జడ్‌పి నుంచి రూ.10 లక్షల మంజూరు చేయించారని తెలిపారు. ఆ నిధులతో బోరు నిర్మాణం పనులు పూర్తి చేసి పైప్ లైన్ ద్వారా వాటర్ ట్యాంక్‌కు నీరు అందిస్తామని తెలిపారు.

పరిటాల సునీత రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - కొవ్వూరు

రాప్తాడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు విఘాతం కల్గించిన రాప్తాడు ఎంఎల్‌ఎ పరిటాల సునీత తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని మాలసంఘాల జెఎసి కన్వీనర్ బొంతా శ్యామ్‌రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 నుంచి రాప్తాడులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు పనులు చేస్తున్నారన్నారు. ఆదివారం విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసుల ద్వారా అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేయడం జీర్ణించుకోలేని పరిటాల సునీత ఇటువంటి దిగజారుడు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. విగ్రదీవవిష్కరణ అడ్డుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు.

నేడు సిఎం పర్యటనపై సమావేశం

ప్రజాశక్తి - కొవ్వూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై 1వ తేదీన మలకపల్లి పర్యటనపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మలకపల్లిలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు.

పశివేదలలో జగన్నాథ స్వామి రథయాత్ర

ప్రజాశక్తి - కొవ్వూరు

మండలంలోని పశివేదల గ్రామంలో ఆదివారం జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్, టిడిపి నేత రాజీవ్‌కృష్ణ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించి, స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు జగన్నాథ స్వామి రథాన్ని, గ్రామస్తులతో కలిసి కొద్ది దూరం లాగారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు పికె. రంగారావు, వేగి చిన్నా, పరిమి హరిచరణ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-కాజులూరు

ట్యాంకర్ ద్వారా తాగునీరు అందిస్తామని మంజేరు సర్పంచ్ గుంటూరు అప్పారావు తెలిపారు. మూడు రోజులుగా గ్రామంలో తాగునీరు లేకపోవడంతో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ట్యాంకర్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని సర్పంచ్ గుంటూరు అప్పారావు తెలిపారు. గొల్లపాలెం తాగునీటి పంపిణీ పథకం ద్వారా పైప్‌లైన్ నుంచి మంజేరు వాటర్ ట్యాంకుకు నీటి సరఫరా చేస్తున్నప్పటికీ మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని చెప్పారు. రెండు రోజుల నుంచి గ్రామీణ నీటి సరఫరా అధికారుల ద్వారా మరమ్మతులు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఇంటింటికీ ట్యాంకర్ ద్వారా చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే జల్‌జీవన్ మిషను పనులను గ్రామంలో ప్రారంభించాలని సర్పంచ్ అప్పారావు కోరారు. జల్ జీవన్ పనులు పూర్తయితే గ్రామంలో తాగునీరు ఇబ్బందులు ఉండవని ఆయన తెలిపారు.